# The Mind Every Thing (1863)

## మనస్సేమూలము

భక్తికి మనస్సే మూలము అని అనేకులు అంటున్నారు. ఈ మాట హిందూ దేశపు ప్రజలలో తరుచుగా వాడుకయైయున్నది. ఒక విధముగా చూచినప్పుడు అది నిజమే. మనస్సు లేకుంటే భక్తి యెక్కడ కుదురుతుంది? కుదర నేరదు. అయినప్పటికీ మనస్సు యెటువంటిదో దాని ప్రవర్తన యే చొప్పున వున్నదో భక్తి అనేది యెక్కడ వుంచవచ్చునో వీట్లను గురించి ముందుగా శోధించవలెను. మొదట మానసపరీక్ష చేయకుండా భక్తికి మనస్సే మూలము అని వట్టి నోటిమాటలు పలుకుట యెందుకు? అది సరికాదు. కాబట్టి మనస్సులోపలికి దిగి దాని స్వభావ గుణములను లెస్సగా శోధించి చూచి తరువాత భక్తికి తగిన స్థలము విచారించ వలయును.

అయితే యీలాగు చేయక మనస్సే మూలము అని మాటలు మాత్రము పలికే ఓ మనుష్యుడా నీవు యెవడవైనప్పటికీ సరే నిన్ను నేను అడగవలసిన ప్రశ్న ఒకటి వున్నది. యేదంటే - నీ మనస్సు మంచిదో లేక చెడ్డదో దానిని నీవు యెప్పుడైనా పరిశోధించి చూచినావా - యెందుకంటే నీ మనస్సు మంచిదైతే నీ భక్తియున్ను మంచిదిగానే వుంటుంది. లేక నీ మనస్సు చెడ్డదైతే నీ భక్తియున్ను చెడ్డదిగానే వుంటుంది. అది ఎట్లంటే చవిటి గోతి నుంచి తీపెనీళ్ల జక్కర యేలాగు రానేరదో, వుమ్మెత్త చెట్టులోనుంచి ఖర్జూరఫలము యేలాగు పుట్టనేరదో, అలాగే చెడ్డ మనస్సులో నుంచి మంచి భక్తి యెన్నటికి పుట్టనేరదు. కాబట్టి నీ మనస్సు మంచిదా చెడ్డదా అని అడుగుతున్నాను గనుక చెప్పుము.

ఈలాగున నేను ప్రశ్నవేసినప్పుడు నీవు తీవ్రమైన కోపము తెచ్చుకొని యేమీ నా మనస్సు అంత చెడ్డదా? నా భక్తి అంత తగనిదా? అది యేలాగు చెడినదో నీవు చెప్పగలవా? యేదీ చెప్పుమీ అని నీవు అడిగినట్టయితే స్నేహితుడా నీవు కొంచెము శాంతపడి నీలోపలి దృష్టిచేతను ఈ చిన్న పుస్తకమనే అద్దమును ఆ దృష్టి యెద్దనుంచి నీ మనస్సు యొక్క వైఖరిని చూడుమని నిన్ను బతిమాలెదను. అప్పుడు దాని లక్షణములు నీకు నీవే బాగా తెలుసుకొనగలవు. కాబట్టి ఈ దిగువను చూపబోయే నీ మనస్స్థితిని చూడుము.

1. నిజముగా నీ మనస్సు చెడి యున్నది. యెందుకంటే, నీ శరీరమునున్ను, నీ ఆత్మనున్ను సృష్టించిన వాడు దేవుడు. ఆయన ఒక్కడే సర్వశక్తి గల పరమాత్ముడు. మరిన్ని ఆయన మహా పరిశుద్ధుడు. ఆ నిజదేవుని నీవు విడిచిబెట్టితివి. అందువల్ల నీ మనస్సు ఆరి అగ్నిలేని మసిబొగ్గు వలెనే తేజో హీనమై సకల కల్మషముల చేత కప్పబడి యున్నది. ఈ సంగతి నిజమని రుజువు యిచ్చుటకు దేవుని పరిశుద్ధ వేద పుస్తకములో కొన్ని వాక్యములు చూపించెదను చూడుము.

యేలాగునంటే - సత్యమును దుర్నీతిచేత అడ్డగించే మనుష్యుల యొక్క సమస్తమైన భక్తిహీనతకున్ను దుర్నీతికిన్ని విరోధముగా దేవుని కోపము ఆకాశమునుంచి బయలు పరచబడుతున్నది. యెందుకంటే దేవుని గురించి ఏమి తెలియబడ వచ్చునో అది ఆ మనుష్యులలోనే విశదమై యున్నది. దేవుడు అది వారికి విశద పరిచెను. యేలాగంటే - ఆయనయొక్క అదృశ్యమైన అనంత శక్తియున్ను దేవత్వమున్ను జగదుత్పత్తి మొదలుకొని చేయబడిన క్రియలవల్ల తెలియబడి అగుపడుతున్నవి గనుక వారు నిరుత్తరులైయున్నారు. వారు దేవుడని తెలిసియును కృతజ్ఞులై ఆయనను మహిమ పరచక తమ వితర్కములచేత వ్యర్థులై యున్నారు. తాము జ్ఞానులమని చెప్పుకొని బుద్ధిహీనులైరి. వారి అక్షయుడైన దేవుని

మహిమను నాశనమయే మనుష్య - పశు, పక్షి, జంతు, కీటకముల యొక్క ప్రతిమా స్వరూపములకు మార్చిరి. ఆ హేతువు చేతను దేవుడు వారి హృదయములను అపవిత్రతకు అప్పగించెను. దానివల్ల హృదయములు చెడిపోయి - దుర్ణీతి, వ్యభిచారము, వేశ్యాగమనము, పరధనాపేక్ష, అపకారము, అసూయ, మత్సరము, నరహత్య, జగడము, గర్వము, బడాయి, క్రోధము, పగ, అబద్ధము, కొండెము, యీ మొదలయిన సకల దుర్గుణములతో నిండుకొనెను - దేవుని విడిచిన నరుల మనస్సులున్ను తలంపులున్ను ఈ విధముగా చెడిపోయినవి. మనస్స్థితి యీలాగు వుండగా - మనస్సే మూలమని మాటమాత్రము చేతను మాటలతో భ్రమించే ఓ మనుష్యుడా, మీద దృష్టాంతము యిచ్చిన ప్రకారము నీ మనస్సు వుండలేదా? అయితే కొన్ని దుష్టకార్యములు నీవు బహిరంగముగా చేయనప్పటికీ రహస్యముగా నీ హృదయములోనుంచి అవి అన్ని ఊటలుగా ఊరుతూ ప్రవాహములుగా పారుతూ వుండలేదా? అవును నిస్సందేహముగా ఆలాగున్నవి నీవు బుద్ధిమంతుడవై నీ యంతర్ దృష్టిచేత తేరి చూచినట్టయితే అవస్యము నీ మనస్సు చెడి యున్నదని నీకు నీవే ఒప్పుకొందువు.

2. నీ మనస్సు కపటము గలది. నిజముగా మానవుల హృదయము చెడ్డతనముతో నిండి యున్నది. అది సకల దురాశలకు పుట్టినిల్లు. మరిన్ని అది ఇతరులను మోసపుచ్చుటకు అనేక మాయోపాయ తంత్రములు కల్పించును. అది నాలుక తుద నుంచి తేనెను బయలుపరిచి లోపల విషము ఇముడ్చుకొని యుండును. అది పెదవులతో స్తుతిని ప్రకటించును. లోపల శాపకారణమయి యుండును - అది పైకి గొర్రెతోలును శృంగారించుకొని మిక్కిలి సాత్వికము కనుపరిచి లోపల తోడేలును దాచి సమయము వెతుకుతున్న వేటకానివలెనుండును - ఓహో మనస్సు యొక్క మార్గము యెవడు కనుగొనగలడు? దాని చిక్కులు యెవడు భేదించి విడదియ్యగలడు? దాని వలలోనుంచి యెవడు

తప్పిజారిపోగలడు? దీని గురించి పరిశుద్ధ గ్రంథములో ఒక పుణ్యపురుషుడు చెప్పిన మాట యేలాగంటే - ఘోరమయిన దుష్టత్వమున్ను, మాయయున్ను గల మనస్సే అన్నిటికి మూలమయి యున్నది. కాగా దానిని యెవరు పట్టి బంధించగలరని చెప్పెను. అవును అది నిజముకాదా - ఈ పత్రికను చదివేనా స్నేహితుడా నీ మనస్సున్ను యిటువంటిదైయుండలేదా? మనస్సే మూలమని యింకా చెప్పుతావా? నీ మాయ మనస్సును నీవు జాగ్రత్తగా శోధించినట్టయితే ఆలాగు మరి చెప్పవు.

3. నీ మనస్సు నిలకడమాలినది. యేలాగంటే - బురదలోనున్న స్తంభమును నీవు యెప్పుడైనా చూచినావా? అది గాలి యే తట్టు విసిరితే ఆ తట్టే వొరుగును. నీ మనస్సున్ను అలాగే ముప్పది మూడుకోట్ల దేవతలలోనున్ను యెవని తట్టు ఇష్టమైతే వాని తట్టేవొరుగుతున్నది.

మరిన్ని సుడిగాలిని నీవు చూచినావా? అది యేలాగు తిన్నగా వెళ్లదో నీ మనస్సున్ను ఆలాగే నానా విధములయిన వంపులు గల మత మార్గములలో పరిభ్రమించి తిరుగుతున్నది.

మరిన్ని తామరాకు మీద వున్న జలబిందువును నీవు చూచినావా? అది ఒక చోట యేలాగు నిలువలేదో నీ మనస్సున్ను అలాగే నిలకడ లేక బహుగా చలిస్తూ వున్నది.

మరిన్ని సముద్రపు కెరటములను నీవు చూచినావా? అవి లెక్కించుటకు అలవిగానివై యేలాగు పుట్టి పెరుగుతున్నవో అలాగే నీ మనస్సులోనుంచి నానా విధమైన తలంపులు అపరిమితముగా లేచి వస్తూ వున్నవి.

స్నేహితుడా ఇది నిజము కాదా? యీలాంటి నిలుకడ లేని మనస్సును నీవు గురిపట్టి చూచినప్పుడు ఇంకా నీ మనస్సే మూలమని పలుకుతావా?

అలాగు మరి పలుక కూడదని తోచవచ్చును - మనస్సి ్ధతిని గురించి ఇంతమటుకు నీవు చేసిన తరువాత ఒక వేళ నీవు నిజమే నామనస్సు బాగులేక నిలకడ మాలినదై యున్నప్పటికీ యేదో ఒక సాధనముచేత దాన్ని కట్టవచ్చును గదా? అలాగుచెయ్యలేనా అని అంటావు గాబోలును. అది వట్టిమాట సుమీ. యేమంటే మనుష్యులచేత కల్పించబడిన యే సాధనమున్ను నీ మనస్సు కట్టుటకు పనికిరాదు - బాగా ఆలోచించి చూడుము వెర్రి కుక్కను చివుకు నులక త్రాటితో కట్టి సాధుగా చెయ్య వచ్చునా? లేక వెర్రి యేనుగును ఒక అల్పిన సూది చూపి భయపెట్టి స్వాధీనపరుచుకొన వచ్చునా? మరిన్ని ఆకటితో చెలరేగుతూ వున్న బెబ్బులిని సాలెపురుగు నేసిన వలలో పడద్రోయవచ్చునా? ఆ దుష్ట జంతువులను కట్టుటకు ఆ సాధనములు యేలాగు పనికి రావో ఆలాగే నీ చెడ్డ మనస్సును కట్టేటందుకు ఈ దేశములో కల్పించి యున్న సాధనములన్నీ యెందుకూ పనికిరాక వ్యర్థమైపోవును.

4. నీ మనస్సును నీవు నమ్మకూడదు. యెందుకంటే-అది నీ సత్కార్యములన్నిటినీ కలక పరిచి నిన్నే మోసపుచ్చును. దీని గురించి భాగవత పురాణమునందలి పంచమస్కందములో చెప్పియున్న విధము చూడుము.

## కందపద్యములు

1. చిరకాల తపమునైనను!
హరియింపగనోపు చిత్తమని పెద్దలు న!
మ్మరు జారులకును జారిణి!
కరణిని యడరించు మనసు కామాదులకున్

2. కామక్రోధాదులు దా!
భూమీశ్వరకర్మబంధములు మరియును చే!
తో మూలములగుటను దా!
రీ మహిలో మనసు నమ్మరెప్పుడు పెద్దల్!

మీది పద్యముల ముఖ్య తాత్పర్యము యేదనగా – కామక్రోధాదులు దుష్కర్మ కారణములనియును మనస్సుకు మూలమైనవి యనిన్ని జార స్త్రీ జార పురుషులను యేలాగు చెరుపునో ఆలాగే బహుకాల తపస్సునైనా మనస్సు చెరుపుతుందనిన్ని, అందుచేత పెద్దలైనవారు తమ మనస్సును యెన్నటికీ నమ్మరని చెప్పి యున్నది.

ఇదిన్ని గాక బైబిలను దేవుని పరిశుద్ధ గ్రంథములో చెప్పి యున్న విధము యేలాగంటే – తన హృదయమును నమ్ముకొనేవాడు శుద్ధ మూఢుడనిన్ని

తనలోతాను జ్ఞానినని అనుకొనే మనష్యుని కంటే మూఢుడైన మరియెకని మీద నమ్మికవుంచవచ్చుననిన్ని.

యెవడున్ను తన స్వబుద్ధిమీద ఆనుకోకూడదనిన్ని. యీలాగున జ్ఞానియయిన వాడొకడు వ్రాసి యుంచినాడు.

పైనుదాహరించిన సాక్ష్యములను నీవు జాగ్రత్తగా చదివి గ్రహించి మానస పరీక్ష గలవాడవైతే నీ మనస్సును నీవు చేరకనున్ను దానిని నమ్మకనున్ను మనస్సే మూలమని మునుపటి వలె సంభాషించక వుందువని నేను తలంచుచున్నాను.

ఆలాగైతే ఇప్పుడు ఈ చెడిపోయిన నా మనస్సును యెవరు బాగుచెయ్యగలరు? మరి దేనిని నేను నమ్మవలెను? అని నీవు అడిగినట్టయితే అందుకు చెప్పుతాను వినుము.

నా స్నేహితుడా ముందుగా నీకు నేను ఇచ్చే పరామర్శ ఏదంటే – ఒక మసిబొగ్గుకు మరి యొక మసిబొగ్గు యేలాగు తేజము ఇవ్వలేదో ఆలాగే చెడిన మనస్సును చెడు మనస్సుగల వేల్పులయినా గురువులయినా బాగుచెయ్య జాలరని నీవు నిశ్చయించుకొనవలెను.

మనసే మూలము నీదు భక్తికిని కృష్ణా దేవకీ నందనా!!

అనే యీ వాక్యము నీవు గాని ఇతరులు గాని యెంత కాలము మననము చేసి నా మనస్సున్ను భక్తిన్ని అణుమాత్రమైనా పరిశుద్ధములు కావు. ఎందుకంటే - నీ మనస్సు యేప్రకారము చెడి యున్నదో ఆ కృష్ణుని మనస్సున్ను ఆలాగే చెడ్డది. అయితే ఒక్క కృష్ణునిదే కాదు సుమీ బ్రహ్మ, విష్ణు, మహేశాదులగు ముప్పదిమూడు కోట్ల వేల్పుల మనస్సులున్ను మరిన్ని నరజాతిలో సకల మానవుల హృదయములున్ను చెడిపోయి యున్నవి. కామ, క్రోధాది దుర్గుణములను అంటని మనస్సుగలవాడు వేల్పులలోనైనా నరులలోనైనా ఒకడూలేడు చెట్టును దాని ఫలమువల్ల మనము తెలుసుకొన్నట్టు ప్రతివాని హృదయమున్ను వాని వాని క్రియల వల్ల మనము గ్రహించవచ్చును. కాబట్టి మీ మనస్సు వంటి మనస్సు గల వేల్పుల యొక్క సాంగత్యము బొత్తిగా నీవు విడిచి పెట్టవలెను. ఎందుకంటే - సంసర్గజా దోషగుణాభవంతి!! అని బుద్ధిమంతులు చెప్పినారు. చెడ్డవానితో చెడ్డవాడు సాంగత్యము చేయుట నీలిమేఘముతో చీకటిరాత్రి కలుసుకొనినట్టుగా నుండును. యెందుకంటే నల్లని మేఘమువల్ల ఆచీకటి బలపరచబడినట్లు వారి చెడ్డతనమున్ను మరింత అధికముగా ఉదయించును. మరిన్ని దుష్ట సాంగత్యములు మంచి నడతలను చెరుపునని పరిశుద్ధగ్రంథములో వ్రాయబడి. యున్నది ఇందుచేత చెడ్డ సాంగత్యమునీవు మానవలెను.

ఇప్పుడు నీవు చేయతగినది యేదంటే ఒక మసిబొగ్గు యెత్తి అగ్నిలో ప్రవేశపెట్టుటవల్ల ఆ మసి బొగ్గుకు మాలిన్యము వదిలి తేజస్సు యేలాగున వచ్చునో ఆలాగునే నీ సుబుద్ధి పూర్వకముగా నీ మనస్సును ఆ పరమాత్మలో ప్రవేశపెట్టితివా నీ మనోమాలిన్యము యావత్తు పోగొట్టి ఆ పరమాత్మ నిన్ను పవిత్రుని చేసును. అయితే యీలాగు చేసుటకు దేవుని పోలిన ఒక మధ్యవర్తి నీకు వుంటేనేగాని, లేకుంటే నీ యంతట నీవే దేవుని యొద్దకు వెళ్లలేవు. ఎందుకంటే మొదట నీ సృష్టికర్తయైన దేవుని నీవు

విడిచి పెక్కు చిల్లర వేల్పులను వెంబడించి విగ్రహరూపములయిన వాటిని పూజించి మ్రొక్కినావు. మరిన్ని లెక్కలేని పాపములు చేసియున్నావు. ఇందువల్ల నీవు గొప్పద్రోహివై సర్వనాశన శిక్షకు పాత్రుడవైయున్నావు. కాబట్టి నీ యంతట నీవు దేవుని యొద్దకి వెళ్లలేవు. న్యాయము యీలాగు వున్నప్పుడు ఒక వేళ నీవు దుస్సాహసము చేసి నా యంతట నేను యెందుకు వెళ్లకూడదు అవశ్యము వెళ్లుదునని మొండి తెగువతో వెళ్లినట్టయితే ఆ మహా పరిశుద్ధుడైన పరాత్పరుని యొక్క న్యాయపీఠము యెదుట మండుతూవున్న ఆరని అగ్ని త్వరగా నీ మీదికి దిగి వచ్చి నిన్ను చుట్టబెట్టుకొని తీసుకొనిపోయి అతి భయంకరమైన బాధలు గల అగాధ నరక కుండములో నిన్ను పడవేసును. కాబట్టి నా స్నేహితుడా అట్టి దుస్సాహసము నీవు మాని ముందుగా నీలో నీవు దేవుని నీతి న్యాయములకు విరోధముగా నడిచిన మహాపాపివని తెలుసుకోవలెను. అందుకు మనస్పూర్తిగా ఒప్పుకోవలెను. ఒప్పి శాశ్వత దండనకు పాత్రుడనై యున్నానని నిన్ను నీవే తీర్పు చేసుకోవలెను. నిష్కపటముగా ఇంత మట్టుకు నీలో నీవు నిశ్చయించుకున్న తరువాత నేను రక్షించబడుటకు ఏమి చేయవలయుననే చింత నీలో ఉదయించును. అట్టి మనస్తాపము గల చింతతో నీ యంతర్ దృష్టి చేతను నా రక్షణ కొరకు మార్గము యేది యని శోధించుటకు నీవు ఆరంభింతువు. అట్టి సమయమందు నీ తండ్రియైన దేవుని కృప నీ యొద్దికి దిగి వచ్చును. వచ్చి నీ పాపములు పరిహరించి నిన్ను దేవుని యెదటికి తెచ్చి సమాధానపరిచి ఆనందమిచ్చేటందుకు చాలిన మధ్యవర్తి యెవడో అట్టి వాని నీకు బయిలుపరుచును. అప్పుడు నీవు ఆయనను చూడగానే నీ హృదయము కరిగిపోయి ఆహా ఈయనే నా రక్షకుడు, ఈయనే నా మధ్యవర్తి ఈయనే నాపాపము కొరకు యింత కష్టపడి మృతిబొందెను అని ఆయన యెడల నీకు ప్రేమపుట్టును. ఆప్రేమవల్ల నీ మనస్సు అంత కంతకు పవిత్రమై నీ విశ్వాసమున్ను నీ సంతోషమున్ను కొనసాగి యిహమందే కొంత మట్టుకు నీవు మోక్ష సుఖము అనుభవించ గలవు.

ఇప్పుడు ఆ మధ్యవర్తిని గురించి చెప్పుతాను వినుము. అనాదియైన దేవునిలో ఇమిడియున్న అనాదియైన జీవ వాక్యము తగిన కాలమందు ఈ భూమి మీదికి వచ్చి అవతార మెత్తుటకు దేవునియొక్క అనాది నిర్ణయము వుండెను. ఆ నిర్ణయము 1863 సంవత్సరముల కిందట యూదా దేశములో నెరవేరినది. లోకములన్ని సృష్టించిన ఆ యనాది వాక్యము యేసు క్రీస్తు అనే నామమున దేవమహిమ చేత నొక కన్యకా గర్భము నుంచి నరావతారమెత్తెను. ఆయన శరీరమందు కేవలం నిర్ధోష స్వభావము గల మనుష్యుడుగానున్ను ఆత్మ యందు మహిమ గల నిజమైన దేవుడుగానున్ను తన యావత్కార్యములలో బయిలు పరిచెను. అందువల్ల అయనే సత్యమైన అవతార పురుషుడని యెంచబడెను. ఆ ప్రభువైన యేసు క్రీస్తు ఈ భూమికి రావడము కేవలం సాధారణ ప్రయోజనమునకు కాదు. నరజాతిలో పుట్టిన యావన్మనుష్యుల యొక్క పాపములను పోగొట్టి వారి ఆత్మలను రక్షించి వారిని మోక్షాయత్తులనుగా చేసుటకు వచ్చెను. ఆయన సచ్చరిత్రము అత్యంత పవిత్రమైనది. మరిన్ని శుద్ధ సాత్విక ప్రేమ దయా శమ దమాది సుగుణ సంపదలు ఆయన వల్లను పుట్టినవనుటకు అవే సాక్షులుగా ఆయన యందు మిక్కిలి బలము గలిగి వింతతో ప్రకాశించును. ఆలాగుమరియెక్కడైనా కనలేము, వినలేము. అట్టి ప్రభువును కన్నులారా చూచిన భక్తులు ఆయన యొక్క శుభచరిత్ర వ్రాసినారు. దాని మనః పూర్వకముగా చదివినవారు తమ తెలివికి అందినంత మట్టుకు ఆ కారుణ్య నిధిని గురించి తెలుసుకొని సంతోషిస్తున్నారు. మరిన్ని ఆ రక్షణ కర్తయైన యేసు క్రీస్తు యెటువంటి వాడనగా ఆయనే పరలోక భూలోకములకు సర్వాధికారి. ఆయన పైన వేరొక రాజు లేడు. ఆయనే కార్యకారణ గురుడు. ఎందుకంటే ఆయన పైని వేరొక కార్యకారణ కర్త లేడు, ఆయనే ఉత్తమ మధ్యవర్తి. ఎందుకంటే ఆయన కొరకు వేరొక రాయభారి అక్కడ వుండడు. పాపాత్ములైన నరుల నిమిత్తము ఆయన తన శరీరము మహా ప్రాయశ్చిత్త బలిగా కఠినమైన మరణమునకు అప్పగించినాడు. ఆయన హద్దు లేని సంపూర్ణపుణ్యుడు.

గనుక అతని మరణపు బలి లోకులందరియొక్క సర్వపాప పరిహారమునకు అత్యంతోపకారమయియున్నది.

కాబట్టి జగద్రక్షకుడైన ఆ యేసును నీవు చక్కగా శోధించి తెలుసుకొని ఆయనను నీ రక్షకుడుగానున్ను నీ సద్గురుడుగానున్ను నీ మధ్యవర్తిగానున్ను యెంచుకొని నీ పాపభారమంతా ఆయన మీద బెట్టి నిండు మనస్సుతో నీవు ఆయనను నమ్మినట్టయితే అప్పుడు నీ మనస్సు పరిశుద్ధమయినదౌను. అప్పుడు నీ భక్తి దృఢమైనది అగును. మరిన్ని పరుసము సోకిన లోహమువలె క్రీస్తు సాంగత్యము వల్ల నీ మనస్సు మార్చబడి దాని క్రియలున్ను బాగా నడుచును. ఈలాగు నీకు భక్తి కుదిరిన మీదట విశ్వాసమే భక్తికి మూలముగాని మనస్సే మూలమని మునుపటి వలె మరి చెప్పలేవు. కాబట్టి ఇప్పుడు నేను మిక్కిలి స్నేహ పూర్వకముగా నీకు చెప్పెడిదేమంటే క్రీస్తు చరిత్ర గల శుభవర్తమాన గ్రంథము ఒకటి నీవు సంపాదించుకొనుము అది పరిశుద్ధ పుస్తకము గనుక వినయ మనస్సుతో దాని నీవు చదవవలెను. ఆలాగు నీవు చదివినప్పుడు కొన్ని సందేహములు నీలో నీకు తీరనివిగా వుండును అందు నిమిత్తము నీవు మరేమిచేయవలెనంటే క్రీస్తుమత బోధకులు వుండే స్థలములకు నీవు వెళ్లి వారిని తెలుసుకొనవలెను. అప్పుడు వారు నీ సందేహములు తీర్చుదురు. అంతే కాకుండా మరిన్ని నీవు అడిగే ప్రశ్నలన్నిటికి వారు సదుత్తరములు యిచ్చి నీ ఆత్మ క్షేమము కొరకు యేది చేయవలయునో దాని వారు చేయజాలుదురు. అది చేయుటకు వారు సిద్ధముగావున్నారు. ఈ చిన్నపుస్తకము చదివే నాస్నేహితుడా నీవు ప్రభువైన యేసు క్రీస్తు యొద్దకి వెళ్లుటకు ఆలస్యము సేయక త్వరగా లేచి నీ రక్షణ భాగ్యమును వెతికి పుచ్చుకొనుమని నిన్ను వేడుకొంటూవున్నాను.